సాక్షి కామారెడ్డి

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



అప్రమత్తంగా ఉండాలి

పోలీసులు బుధవారం పలు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించారు.

- 8లో ▸



పద్ధతి కాదు..

సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను దూషించడం పద్ధతి కాదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.7 /18.5

ఉదయం చలి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి టౌన్: మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆరు మైనారిటీ గురుకుల పాఠశాలలు, ఐదు జూనియర్ కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం ఆసక్తిగలవారు 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 99122 44005 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

కామారెడ్డి టౌన్: కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల కమిటీ సమావేశంలో ఎన్నికల కమిటీ కన్వీనర్ శనిశెట్టి గౌరి శంకర్, కోకన్వీనర్ కొక్కొండ రవీందర్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాకేంద్రంలోని ఏపీ డ్రగ్స్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు. 9వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 11వ తేదీన పట్టణంలోని పార్శి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలను నిర్వహించనున్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు గజవాడ రవి, కైలాస్ సంతోష్, బొమ్మ రమేశ్, తులసీదాస్, మోహన్ రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆదర్శ బల్దియాగా అభివృద్ధి చేస్తా’



కామారెడ్డి టౌన్: కామారెడ్డిని ఆదర్శ బల్దియాగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో 17 మంది కౌన్సిలర్‌లతో ఆయన సమావేశమయ్యారు. కౌన్సిలర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో అభివృద్ధి విషయమై ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బల్దియా ఆర్థిక సంక్షోభంలో ఉందని, కాంట్రాక్టర్‌లకు రూ. 5 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉందని, కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కామారెడ్డిని అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, కౌన్సిలర్లు సయ్యద్ అన్వర్, మహమ్మద్ ఇషాక్ షేరు, పాత శివకృష్ణమూర్తి, పాక జ్ఞానేశ్వరి, చాట్ల వంశి, రవీందర్ గౌడ్, ఉర్దొండ వనిత, రమేష్, ఆస్మా, మమత, శంకర్‌రావు, సుతారి రవి, తేజపు మానస, ఇల్లెందుల లత, నాయకులు ప్రసాద్, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్: అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. మంగళవారం నాటికి 2.65 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ జరిగిందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

‘బెస్ట్ అవైలబుల్’ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నుంచి 2024–25 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాల కోసం కలెక్టరేట్‌లోని రూం నంబర్ 113లో గాని, 83280 15942 ఫోన్‌నంబర్‌లో గాని సంప్రదించాలని సూచించారు.

‘సమస్యలుంటే హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేయండి’

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు వారి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు 72079 76565, 70322 25344 నంబర్లకు ఫోన్‌చేసి సమస్యలను విన్నవిస్తే ఎమ్మెల్యే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

విజృంభిస్తున్న ‘మంప్స్’

- గవద బిళ్లల సమస్యతో బాధపడుతున్న చిన్నారులు
- వ్యాప్తి చెందుతున్న వైరస్
- ఆస్పత్రులకు పెరుగుతున్న తాకిడి



జిల్లాలో గవద బిళ్లల వ్యాధి విజృంభిస్తోంది. ఒకరినుంచి ఇంకొకరికి వేగంగా వ్యాప్తి చెందుతోంది. రెండు నెలలుగా జిల్లావ్యాప్తంగా చాలామంది ఈ వ్యాధి బారిన పడి మంచం పడుతున్నారు. పిల్లలు నొప్పిని భరించలేక విలవిల్లాడుతుండడంతో తల్లిదండ్రులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

– సాక్షి, కామారెడ్డి

జిల్లావ్యాప్తంగా మంప్స్ వైరస్ చిన్నారులను ఇబ్బందిపెడుతోంది. గవద బిళ్లల సమస్యతో పిల్లలు మంచం పడుతున్నారు. చెవుల కింద, దవడ భాగాల్లో వాపు రావడంతోపాటు తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్ల నొప్పి, కీళ్లల్లో వాపు, నోరు తడారిపోవడం, ఆకలి మందగించడం, జ్వరం తదితర లక్షణాలతో పిల్లలు బాధపడుతున్నారు. చిన్న పిల్లలకు గవద బిళ్లల సమస్య ఎదురైనపుడు వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య చెప్పుకోలేక ఏడుస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వైరస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, లేకపోతే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

ఇలా వ్యాపిస్తుంది..

గవద బిళ్లల సమస్యతో బాధపడుతున్న వ్యక్తి దగ్గినపుడు, తుమ్మినపుడు, మాట్లాడినపుడు వైరస్ గాలిలో ప్రయాణించి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా 15 ఏళ్ల లోపు పిల్లలలో ఈ సమస్య కనిపిస్తుంది. స్కూళ్లకు వెళ్లే చిన్న పిల్లల్లో ఒకరికి సమస్య ఎదురైతే తెలియకుండానే ఒకరి ద్వారా అందరికీ వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి.

ఆస్పత్రులకు క్యూ..

గవద బిళ్లలు సమస్యతో చిన్నపిల్లల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలో ఏ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా పదుల సంఖ్యలో గవద బిళ్లలు సమస్యతో వస్తున్నవారే కనిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో వందలాది మందికి వైరస్ సోకింది. కొన్ని కుటుంబాల్లో పిల్లల ద్వారా పెద్ద వాళ్లకు సైతం వైరస్ వ్యాప్తి చెందింది. గవద బిళ్లలు సోకిన వారు వారం రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మంప్స్ వైరస్‌తో బాధపడుతున్న పిల్లలను బడికి పంపకుండా ఇంట్లోనే ఏకాంతంగా ఉంచాలని, ఇంట్లో తయారుచేసిన తేలికపాటి ఆహారాన్ని అందించాలని పేర్కొంటున్నారు. తగినంత మంచినీరు, పండ్ల రసాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

భయపడొద్దు.. తేలికగా తీసుకోవద్దు

గవద బిళ్లలుగా పేర్కొనే మంప్స్ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. జ్వరం, తలనొప్పి, నీరసించిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇంట్లో ఒక చిన్నారిలో సమస్యను గమనిస్తే మిగతావారికీ వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. ఇలాంటి సమయంలో మిగతా పిల్లలనుంచి దూరంగా ఉంచాలి. ఈ వ్యాధికి భయపడొద్దు.. అలాగని తేలికగానూ తీసుకోవద్దు. వైరస్ బారిన పడినపుడు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి. వైద్యుల సూచనలకు అనుగుణంగా మందులు వాడడంతో పాటు శక్తినిచ్చే ద్రవాహారాన్ని అందిస్తే త్వరగానే వ్యాధి తగ్గిపోతుంది.

– నరేందర్‌రావు, పిల్లల వైద్యులు, కామారెడ్డి

మోగనున్న పెళ్లి బాజా

- శుభ ముహూర్తాలను మోసుకొచ్చిన మాఘమాసం
- ఈనెల 11 నుంచి శుభకార్యాలు

సాక్షి, కామారెడ్డి: మాఘమాసం వస్తూ వస్తూ శుభ ముహూర్తాలను వెంట తీసుకొస్తోంది. ఈనెల 11వ తేదీ నుంచి పెళ్లి సందడి మొదలుకానుంది. మాఘం, పాల్గుణం, చైత్ర మాసాల్లో (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్) దాదాపు ముప్పై ముహూర్తాలున్నాయని వేద పండితులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26 తర్వాత దాదాపు మూడు నెలల పాటు అంటే ఆగస్టు వరకు ముహూర్తాలు లేకపోవడంతో ఈ మూడు నెలల్లోనే ఎక్కువ సంఖ్యలో శుభ కార్యక్రమాలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే చాలా కుటుంబాలు ముహూర్తాలను చూసుకుని పెళ్లిళ్లు, ఫంక్షన్లకు ఏర్పాట్లు చేసుకున్నారు.



వివాహ ముహూర్తాల వివరాలు..

- మాఘమాసం: ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 28, 29, మార్చి 2, 3 తేదీలు.
- పాల్గుణం: మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4 తేదీలు.
- చైత్రం: ఏప్రిల్ 9, 18, 19, 20, 21, 22, 24, 26.

గ్రామాల్లో సమర్థవంతమైన పాలన అందించాలి

- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- స్థాయీ సంఘ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

కామారెడ్డి టౌన్: ప్రత్యేకాధికారులు గ్రామాల్లో సమర్థవంతమైన పాలన అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సమావేశంలో గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం స్థాయీ సంఘ సమావేశంలో ఆస్పత్రుల సమస్యలపై జెడ్పీటీసీలు అధికారులను నిలదీశారు. ఆర్థిక ప్రణాళిక, పనులు స్థాయీ సంఘం సమావేశంలో జిల్లాలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని దాని ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ లభిస్తుందని గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక ఆమోదం కోసం ఈనెల 10న ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ శోభ

ప్రతి ఇంటికి తాగునీరు అందించాలి

- వీసీలో పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్

కామారెడ్డి టౌన్: ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలని పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా స్థాయి అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఏడు రకాల రిజిస్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన నీటిని వాటర్ ట్యాంక్ ద్వారా ప్రజలకు అందించాలన్నారు. అవసరమైన చోట పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రతి నెలలో 10, 20, 30 తేదీల్లో వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాలన్నారు. జిల్లానుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ కృపాకర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, జిల్లా మిషన్ భగీరథ ఈఈ రమేష్, గ్రిడ్ ఈఈ స్వప్న, డిప్యూటీ ఇంజినీర్లు శివకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

‘యోధ’ కవితల సంపుటి ఆవిష్కరణ



యోధ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

కామారెడ్డి అర్బన్: భారత జాగృతి జిల్లా సాహిత్య విభాగం కన్వీనర్ క్లాం నవీన్‌రెడ్డి రాసిన ‘యోధ’ కవితల సంపుటిని మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమ నేపథ్యం, పోరాట స్ఫూర్తి, ఆలోచనలపై కవితలతో ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎస్.నిరంజన్‌రెడ్డి, హరీష్‌రావు, మాజీ స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌రావు, పి.నరేందర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, గెల్లు శ్రీనివాస్ యాదవ్, జాగృతి జిల్లా అధ్యక్షుడు అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బల్దియాపై విజి‘లెన్స్’!

- అవినీతిపై రెండేళ్ల క్రితం ఫిర్యాదు చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే కేవీఆర్
- క్షేత్ర స్థాయిలో తనిఖీలతో నరిపెట్టిన ఉన్నతాధికారులు
- తాజాగా మళ్లీ మొదలైన విచారణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులు మరోసారి దృష్టి సారించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ముగ్గురు విజిలెన్స్ అధికారులు బుధవారం ఆయా విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. కామారెడ్డి బల్దియాలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై బీజేపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రెండేళ్ల క్రితం విజిలెన్స్, సీడీఎంఏ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2021 డిసెంబర్ 16వ తేదీన విజిలెన్స్ అధికారులు వారం రోజులపాటు క్షేత్ర స్థాయిలో పర్యటించి, తనిఖీలు నిర్వహించి సాక్ష్యాలను సేకరించారు. నాసిరకం పనులు, అవినీతి, అక్రమాలపై అన్ని విభాగాల్లో విచారణ చేపట్టి ఫొటోలు, నాసిరకం రోడ్ల శాంపిల్స్, ఇతర ఆధారాలను సేకరించి తీసుకువెళ్లారు. ఆ తర్వాత విచారణ ఊసే ఎత్తలేదు.

ఆయా విభాగాల్లో తనిఖీలు

బల్దియాలో అవినీతి, అక్రమాలపై రెండేళ్లకుపైగా మౌనంగా ఉన్న విజిలెన్స్ అధికారులు తాజాగా మళ్లీ దృష్టి సారించారు. హైదరాబాద్ నుంచి ముగ్గురు విజిలెన్స్ అధికారులు బుధవారం ఉదయం పట్టణానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పలు వార్డులలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టారు. ఆ తర్వాత ఆస్తి పన్నులు, బహుళ అంతస్తుల భవనాల అక్రమాలపై రీవెరిఫికేషన్ కోసం లయోలా స్కూల్, రష్ ఆస్పత్రి, సత్యగార్డెన్ భవనాల కొలతలు తీశారు. అనంతరం ఓపెన్ స్థలాల కబ్జాలు, అక్రమ భవన నిర్మాణాలపై దేవునిపల్లి, నిజాంసాగర్ రోడ్‌లలో తనిఖీలు చేపట్టారు. వారి వెంట ఆర్‌వో గోపాలకృష్ణ, టీపీవో గిరిధర్, టీపీఎస్ రాజేష్, ఆర్‌ఐ జానయ్య, సానిటరీ ఎస్సై రవీందర్‌లు ఉన్నారు. మరో రెండు పాటు తనిఖీలు కొనసాగనున్నాయి.



దేవునిపల్లిలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

2021లో తనిఖీలలో ఏం తేలిందంటే..

- సాందీపని కళాశాల ముందు, సైలానీబాబా కాలనీలో నాణ్యత లోపంతో రోడ్డు వేసినట్లు గుర్తించారు.
- హరిజనవాడలో 2017లో వేసిన రోడ్డుపైనే 2018లో మళ్లీ రోడ్డు వేశారు.
- మురికి కాలువలు, కల్వర్టు పూర్తిగా నాణ్యతలోపంతో నిర్మించారు.
- అశోక్‌నగర్ కాలనీలో రోడ్డు వేసినట్లు ఎంబీ రికార్డులు నమోదు చేసి వాటిపైనే మళ్లీ హరిజనవాడలో రోడ్డు వేసినట్లు బిల్లులు తీసుకున్నారు.
- కాకతీయనగర్ కాలనీలో సీసీ రోడ్లు వేసి ఐదేళ్లు కాకుండానే మళ్లీ పనులకు అంచనాలు తయారు చేశారు. బాగున్న రోడ్డుపై మళ్లీ రోడ్డు ఎందుకని అప్పట్లో విజిలెన్స్ డీఈ అడిగిన ప్రశ్నకు మున్సిపల్ డీఈ, ఏఈ సమాధానమివ్వలేకపోయారు. దీంతో రోడ్డుపై వారిని నిలబెట్టి ఫొటోలు తీసుకున్నారు.
- హౌజింగ్‌బోర్డు కాలనీ, గోస్కె రాజయ్య కాలనీలలో కూడా సీసీ రోడ్ల పనుల్లో అవినీతి జరిగిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వేసిన రోడ్డుపై రోడ్డు వేయడం, ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపులు, ఎస్టిమేషన్‌లు రూపొందించడంపై అప్పట్లో విజిలెన్స్ అధికారులు అవాక్కయ్యారు. అయితే అవినీతి, అక్రమాలు జరిగినట్లు తనిఖీలలో గుర్తించి రెండేళ్లు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఫిర్యాదు చేసిన కేవీఆర్ ప్రస్తుతం కామారెడ్డి ఎమ్మెల్యే కాగానే మరోసారి విచారణ మొదలైంది. అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘విశ్వకర్మ యోజన’ను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: సంప్రదాయ చేతివృత్తులు, హస్తకళాకారులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పథకం అమలుకు ఏర్పాటు చేసిన జిల్లా అమలు కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపరిచి ఉత్పాదకత నాణ్యత, ఉత్పత్తులను పెంచడం ఈ పథకం ఉద్దేశమన్నారు.

ఈ పథకంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విశ్వకర్మలందరూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాల ద్వారా కుల వృత్తులు చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. పథకంలో చేరినవారికి విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డుతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవడానికి కావలసిన శిక్షణ, టూల్ కిట్స్, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వ మద్దతు లభిస్తాయన్నారు. 18 ఏళ్లపైబడిన కుటుంబంలో ఒకరు ఎలాంటి విద్యార్హత లేకున్నా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఎస్‌ఎంఈ సహాయ సంచాలకులు రాజేష్ కుమార్ యాదవ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లు లాలు నాయక్, రఘునందన్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో భాగ్యలక్ష్మి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సురేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పథకం గురించి వివరిస్తున్న ఎంఎస్‌ఎంఈ సహాయ సంచాలకుడు రాజేష్ కుమార్ యాదవ్

తప్పిదాల సవరణకు సర్వే

కామారెడ్డి టౌన్: ప్రజాపాలనలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులలో తప్పిదాలను సవరించేందుకు సర్వే చేపట్టనున్నారు. తప్పిదాల సవరణకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్లు ఇతర అధికారుల నేతృత్వంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన దరఖాస్తులలో సమగ్ర వివరాలు లేవని పేర్కొన్నారు. గ్రామాలలో బృందాలు పర్యటించి దరఖాస్తుదారుల గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్జూమర్ నంబర్, రేషన్ కార్డు నంబర్ వంటి వివరాలను సేకరిస్తారని తెలిపారు. ప్రతి బృందం రోజుా కనీసం 30 దరఖాస్తులను పరిశీలిస్తుందని వివరించారు. దరఖాస్తులు సక్రమంగా ఉన్న వాటికి సంబంధించి వాటి ఆమోదం నిమిత్తం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, సర్వే బృందాలు తమను సంప్రదించలేదని ఇతర దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- జిల్లాలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

దోమకొండ: ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. పల్లెల్లో బుధవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామాల్లోని రోడ్లను పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులతో కలిసి శుభ్రం చేశారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్యకేంద్రాలు వంటి ప్రభుత్వ సంస్థల ఆవరణల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. దోమకొండ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. పార చేతపట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేయాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. ప్రతి ఊరు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. రోజువారి కార్యక్రమాలను మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవో సాయిబాబా, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

క్లుప్తంగా

మల్లికార్జున ఖర్గేను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే



నిజాంసాగర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను బుధవారం ఢిల్లీలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కలిశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీ వెళ్లిన ఆయన కాంగ్రెస్ నేతలను, కర్ణాటక రాష్ట్ర మంత్రి ఈశ్వర్ ఖండ్రేను కలిశారు.

వలస జీవుల తిరుగు పయనం



లింగంపేట: ఇల్లు, వాకిలి వదిలి పొట్టకూటి కోసం వలస వచ్చిన కుటుంబాలు తిరుగు పయనమయ్యాయి. జహీరాబాద్, నారాయణ ఖేడ్, కర్నాటకకు చెందిన కూలీలు చెరుకు కొట్టడానికి వచ్చారు. అడ్లూర్ ఎల్లారెడ్డి సమీపంలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని చెరుకు కొట్టి ఫ్యాక్టరీకి తరలించారు. పనులు పూర్తి కావడంతో ఇలా ఇంటి బాట పట్టారు. వారిని లింగంపేట సమీపంలో పలకరించగా వారం పాటు ఎడ్లబండిపై పయనించి స్వగ్రామాలకు చేరుకుంటామన్నారు. పదేళ్లుగా చెరకు కొట్టడానికి కామారెడ్డి జిల్లాకు 2వేల మంది వరకు వస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు కుటుంబ సభ్యులు, పిల్లలను విడిచి వచ్చామన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం



తాడ్వాయి: విద్యార్థులు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ శరత్‌చంద్ర అన్నారు. మండలంలోని సంతాయిపేటలో కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఉమాపతి, స్వర్ణలత, రవీందర్‌రెడ్డి, సంతాయిపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి పరమేశ్వరి పాల్గొన్నారు.

ఫిష్‌ఫామ్ సందర్శన



సదాశివనగర్:మండలంలోని మోడెగాంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్‌ఫామ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్‌లోని వంగుర మండలానికి చెందిన రైతులు సందర్శించారు. చేపల పెంపకం తీరును, వస్తున్న ఆదాయాన్ని ఏపీఎం రాజిరెడ్డి వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా డీఆర్‌డీవో నాగేశ్వర్‌రావు, డీపీవో వెంకటేశ్వర్లు, ఏడీ లక్ష్మప్ప, ఏవో తనూజ, అధికారులు, రైతులు వచ్చారు. కార్యక్రమంలో డీపీఎం రమేశ్ బాబు, గాంధారి ఏపీఎం గంగారాజు పాల్గొన్నారు.

బెల్లయ్యనాయక్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్‌ను లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు బెల్లయ్యనాయక్‌కు కేటాయించాలని జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బుధవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కోటియానాయక్, ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్, నాయకులు చిన్నినాయక్, సక్రు, మోహన్‌నాయక్, చిన్ననాయక్, భూక్యారాజు తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం సమాజ సేవలో..

- పల్లె బాట పట్టిన విద్యార్థులు
- ఎన్ఎస్ఎస్‌లో భాగంగా సేవా కార్యక్రమాల నిర్వహణ



కొల్లూర్‌లో రోడ్డు ఊడుస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

బాన్సువాడ రూరల్: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు పల్లెబాట పట్టారు. ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవాపథకం)లో భాగంగా పల్లెలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. పుస్తకాలే కాకుండా సమాజాన్ని చదువుతున్నారు. ఉదయం చీపురు కట్టలు చేతబూని రోడ్లను ఊడుస్తున్నారు. సాయంత్రం గ్రామస్తులతో మమేకమై మరుగుదొడ్ల నిర్మాణం, పరిసరాల పరిశుభ్రత, నీటి వనరుల సద్వినియోగం, సైబర్‌క్రైమ్, అంటరానితనం, హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన, బాల్యవివాహాలతో జరిగే నష్టాలను వివరిస్తున్నారు.

నాలుగు గ్రామాల్లో..

బాన్సువాడలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో కొల్లూర్, నాగారం గ్రామాల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో- ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాలనే ఉద్దేశంతో వారం రోజుల పాటు శిబిరాలు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు వారం రోజులుగా వారికి కేటాయించిన గ్రామాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగిన వారికే..

కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నా.. సామాజిక సేవా దృక్పథం, ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. వారం రోజుల పాటు గ్రామంలో ఉండడంతో గ్రామంలోని సమస్యలపై అవగాహన పెరిగిందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రిన్సిపాల్ జయకుమారి ఆధ్వర్యంలో కొల్లూర్, నాగారం గ్రామాల్లో శిబిరాలను ప్రోగ్రాం ఆఫీసర్ మద్ది గంగాధర్, రమ్యశ్రీ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ పాండురంగా ఆధ్వర్యంలో సోమేశ్వర్‌లో ప్రోగ్రాం ఆఫీసర్ సిద్దంశెట్టి రుక్మిణీ, దేశాయిపేట్‌లో యాదాగౌడ్ శిబిరాలు విజయవంతంగా కొనసాగాయి.

ఆనందంగా ఉంది



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. కళాశాల నుంచి గ్రామానికి వచ్చి శిబిరంలో పాల్గొనటంతో గ్రామ సమస్యలు తెలిశాయి. సమాజానికి మేలు చేసే అవకాశం లభించింది. కొల్లూర్‌లో జరిగిన శిబిరంలో పనిచేశాను.

– విజయలక్ష్మి, వలంటీర్

గ్రామస్తులు సహకరించారు



నాగారంలో కొనసాగిన శీతాకాల శిబిరంలో పాల్గొన్నా. ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు వచ్చి మాతో పాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొని సహకరించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, సంపూర్ణ అక్షరాస్యత, పచ్చదనం- పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాం.

– స్వాతి, వలంటీర్,

మరిన్ని శిబిరాలు నిర్వహిస్తాం



పనిచేసి అనుభవాలను నేర్చుకున్నాం. విద్యార్థులతో భవిష్యత్‌లో మరిన్ని శిబిరాలు నిర్వహిస్తాం. శిబిరాల ద్వారా విద్యార్థుల్లో ఐకమత్యం పెరగటంతో పాటు గ్రామీణ పరిస్థితులపై చక్కటి అవగాహన కలుగుతుంది.

– గంగాధర్, ప్రోగ్రాం ఆఫీసర్

కేసీఆర్‌ను దూషించడం పద్ధతి కాదు

- హామీలను అమలు చేయకుంటే నిలదీస్తాం
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వారికి హుందాతనం ఉండాలని, మాజీ సీఎం కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి దూషించడం పద్ధతి కాదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ సమీపంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతం తక్కువ ఓట్ల తేడాతో అధికారం కోల్పోయమన్నారు. 20 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారిస్తే సరిపోయేదన్నారు. 2028లో ప్రజలు బ్రహ్మండమైన మెజారిటీతో బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని అన్నారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకుడు సిగ్గులేకుండా బాన్సువాడ నియోజకవర్గంలో తిరుగుతున్నారని, ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉండి సొంత ఊరిలో పేదలకు ఒక్క ఇల్లు కట్టించలేదన్నారు. ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. చేయకపోతే ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బంధు రూ.15 వేలు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపును బాన్సువాడ నియోజకవర్గమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. నిజాంసాగర్ నీటి విడుదల విడతల వారీగా జరుగుతుందని, ఎకరం కూడా ఎండిపోకుండా చూస్తానన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీకి సిద్ధం

పార్టీ ఆదేశిస్తే జహీరాబాద్ ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కీలకమైన నియోజకవర్గం బాన్సువాడ అన్నారు. ప్రతి కార్యకర్తకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. పోచారం సురేందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, అంజిరెడ్డి, బద్యానాయక్, నీరజావెంకట్‌రాంరెడ్డి, శ్యామల ఉన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నస్రుల్లాబాద్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని హాజీపూర్‌లో గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి గ్రామంలో బస చేశారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర పథకాలను వివరించారు. ఎరువుల గోదాంను పరిశీలించారు. మండలాధ్యక్షుడు సున్నం సాయిలు, సావిత్రి, కంది మల్లేష్, అరిగె అంజయ్య పాల్గొన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే యెండల

ఆరు నెలలుగా అందని వేతనాలు

- ఇబ్బందులు పడుతున్న ఎల్లారెడ్డి ఆస్పత్రి సానిటేషన్ సిబ్బంది

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సానిటేషన్ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో 18 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో సానిటేషన్ వర్కర్లు 8మంది, పేషెంట్ కేర్ వర్కర్లు ఆరుగురు, సెక్యూరిటీ గార్డులు నలుగురు ఉన్నారు. వీరికి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ప్రతి నెల రూ.11 వేల వేతనాన్ని అందిస్తున్నారు. అసలే తక్కువ వేతనం కాగా నెలనెల వేతనం రాక కుటుంబం గడవడానికి సైతం ఇబ్బందిగా ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. ఆరు నెలలుగా వేతనం అందక మరోవేదనకు గురవుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నెలనెల వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి

ఏజెన్సీకి సూచించాం

ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు రాని విషయం నా దృష్టికి వచ్చింది. వేతనాలు చెల్లించాలని ఏజెన్సీ వారికి సూచించాం.

– రవీంద్రమోహన్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, ఎల్లారెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదాశివనగర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఎల్లారెడ్డిలో..



సాందీపని డిగ్రీ కాలేజీలో..

సదాశివనగర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవరికి చెప్పొద్దన్నారు. పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్‌లు చేయొద్దని సూచించారు. ప్రిన్సిపాల్ భానుమతి, ఎస్సై రాజు, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, విండో చైర్మన్ కమలాకర్ రావు, ఐఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు రాజేందర్ రావు, రవళి, అధ్యాపకులు రాజశేఖర్ రావు, రాజేందర్, లింగమయ్య, చిత్రలేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్గి ఉండాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ సూచించారు. బుధవారం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ సాయిబాబా, వైస్ ప్రిన్సిపాల్ శశిశంకర్, నాగరాజు, ఏఎస్సై నర్సింగ్‌రావు, విజయ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: పెద్దకొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో ఎస్సై కోనారెడ్డి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. పోలీస్ సిబ్బంది వెంకట్, రవి, గోరి, అంజి, ఉపాధ్యాయులు గంగకిషన్ పాల్గొన్నారు.

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. హెచ్ఎం గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరు: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని భిక్కనూరు ఎస్సై-2 రాంచందర్ అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరు చైతన్య విద్యానికేతన్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించారు. మైనర్‌లు వాహనాలను నడిపించవద్దన్నారు. సిబ్బంది అంజయ్య, మోహన్, శ్రీరామ్, పాఠశాల కరస్పాండెంట్ భూర్ల రేణుకుమార్, హెచ్ఎం అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: మాదక ద్రవ్యాల నిర్మూలనపై పట్టణంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ ఎస్సై ఇంద్రసేనారెడ్డి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు, అకాడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, అధ్యాపకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని ధర్మారెడ్డిలో సైబర్ నేరాలపై బుధవారం ఎస్సై రాజు అవగాహన కల్పించారు. కానిస్టేబుళ్లు గంగారాం, దక్షిణామూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ పలువురి మృతి

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన రాంపూర్ కృష్ణ(32) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నెల 1న తన బైక్‌పై భార్య, కుమారుడితో కలిసి పిట్లంకు వెళ్తుండగా జగదాంబ తండా సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కృష్ణను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. కృష్ణ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ..

నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూరు సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన దూసమూడి రుక్మవ్వ (42) భర్త సాయన్న, కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం ఆర్మూర్‌కు వలస వచ్చారు. ఈ నెల 1న భర్తతో కలిసి బైక్‌పై స్వగ్రామమైన ఎడ్‌బిడ్‌కి మంగళవారం వెళ్తుండగా కొండూరు సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో రుక్మవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వన్నెల్ సమీపంలో మరొకరు..

నందిపేట్: మండలంలోని వన్నెల్(కె) సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన పద్మ (27) ఈనెల 2న తన మామతో కలిసి బైక్‌పై ఆర్మూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ పద్మను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

కాలువలో పడి ఒకరి మృతి

నందిపేట్: మండల కేంద్రంలోని గుత్ప కాలువలో ఒకరు పడి మృతిచెందినట్లు ఎస్సై రాహుల్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన లోక మహిపాల్‌రెడ్డి(35) వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం నందిపేటకు వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని కాలువ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో నీటి సరఫరాను నిలుపుదల చేయించారు. కాలువలో ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ శివారులో బుధవారం ఆటో బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ సయ్యద్ నజీర్(56) మృతిచెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సయ్యద్ నజీర్ సొంత ఆటోలో ఆర్మూర్ నుంచి మోర్తాడ్‌కు వెళ్తుండగా అంక్సాపూర్ శివారులో కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించబోయి బోల్తాపడినట్లు తెలిపారు. ఈ ఘటనలో నజీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహితపై అత్యాచారయత్నం

నందిపేట్: నందిపేటలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న వివాహితపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి బుధవారం పాల్పడ్డాడు. బాధితురాలి అరుపులు విన్న కాలనీవాసులు అక్కడికి చేరుకునే లోగా పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. సదరు వివాహిత ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన భర్త గురించి అడిగి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



కామారెడ్డి టౌన్: పట్టణ కేంద్రంలోని పలు చోట్ల టాస్క్‌ఫోర్స్ పోలీసులు 22.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టుకున్నారు. రాజీవ్‌నగర్‌కు చెందిన రేవూరి ప్రభాకర్ నుంచి 9.15 క్వింటాళ్లు, జేపీఎస్ రోడ్డులో కొడిప్యాక శ్రీనివాస్ నుంచి 2.25 క్వింటాళ్లు, కిష్టమ్మ గుడి సమీపంలో మమ్మద్ అజీజ్ నుంచి 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. డీఎస్‌వో మల్లికార్జున బాబు, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య ఆధ్వర్యంలో బుధవారం పంచనామ నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

అదుపుతప్పిన కారు

ఇందల్వాయి: మండలంలోని అటవీ ప్రాంతంలో కారు అదుపు తప్పిన ఘటనలో దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా తుక్కల ఎల్లారెడ్డికి చెందిన స్వరూప వెంకటేశ్వర దంపతులు కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు ఇందల్వాయి అటవీ ప్రాంతంలోని జాతీయ రహదారిపై పక్కదారిలోకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడ్డ దంపతులను టోల్ ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

నకిలీ మందుల విక్రయం

రాజంపేట: నకిలీ మందుల విక్రయాన్ని రైతులు అడ్డుకున్నారు. ఈ ఘటన మండలంలోని కొండాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. వ్యవసాయాధికారుల కథనం ప్రకారం.. కొండాపూర్‌లో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన వారు ఆటోలో అగ్రి హ్యూమిక్ గ్రానల్స్‌ను అమ్ముతుండగా రైతులు అడ్డుకొని ఏఈవో మౌనికకు సమాచారం అందజేశారు. ఆమె గ్రామానికి చేరుకొని ఏవో సుప్రియ జ్యోతికి సమాచారం అందించారు. ఏవో ఘటన స్థలానికి చేరుకొని వారి నుంచి గంట మందుల బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మందులు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్య



సందీప్(ఫైల్)


కామారెడ్డి క్రైం: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా సమీపంలోని నర్సన్నపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఎలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన మెత్తల సందీప్(26) కామారెడ్డిలోని ఓ కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఉదయం నర్సన్నపల్లి గేటు వద్ద ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఎస్సై తావు నాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. విచారణలో మృతుడిని సందీప్‌గా గుర్తించారు. సందీప్ తండ్రి కుటుంబాన్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడని, అతని సోదరుడు సైతం రైలు ప్రమాదంలో మృతి చెందాడు. పలు కారణాలతో కొన్ని రోజులుగా అతని మతిస్థిమితం బాగా లేదని కుటుంబీకులు తెలిపారు. మతిస్థిమితం సరిగా లేకనే ఆత్మహత్య చేసుకున్నాడన్న అతని భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జంతువుల దాడిలో మేకల మృతి



ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్ తండాలో లావుడ్య గోప్యకి చెందిన ఏడు మేకలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని అటవి జంతువులు దాడి చేసి చంపినట్లు డీఆర్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీటీసీ లలితాగణేశ్ ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి పశువైద్యాధికారి గంగాప్రసాద్‌తో కలిసి మృతి చెందిన మేకలకు బుధవారం పంచనామా నిర్వహించినట్లు చెప్పారు. మేకల కొట్టం అటవికి దగ్గరగా ఉండటంతో జంతువులు దాడి చేశాయన్నారు. బాధితుడికి అటవీశాఖ తరఫున పరిహారం అందేలా కృషి చేస్తామని డీఆర్వో తెలిపారు.

రామేశ్వర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ మృతి



దుబ్బాగౌడ్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ గొల్లపల్లి దుబ్బాగౌడ్ (76) బుధవారం మృతి చెందారు. ఆయన నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన అయ్యప్ప మాలను క్రమం తప్పకుండా 18 ఏళ్లు ధరించి కొబ్బరిచెట్టు సీనియర్ గురుస్వామిగా గుర్తింపు పొందారు. దుబ్బాగౌడ్‌కు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కాశీలో తల్లి అస్థికలు నిమజ్జనం చేసేందుకు వెళ్తూ..

- రైలులో గుండెపోటుతో తాళ్లరాంపూర్ వాసి మృతి



కుమార్ (ఫైల్)

మోర్తాడ్: తల్లి అస్థికలను కాశీలోని గంగానదిలో నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న ఏర్గట్లకు చెందిన తాళ్లరాంపూర్‌కు చెందిన కుమార్(44) గుండెపోటుతో మృతిచెందాడు. తన అక్క, బావలతో కలిసి కుమార్ మంగళవారం రైలులో కాశీకి బయలుదేరి వెళ్లాడు. బుధవారం అలహాబాద్ సమీపంలో కుమార్‌కు తీవ్ర గుండెపోటు వచ్చింది. దీంతో అతనికి చికిత్స అందించే ప్రయత్నంలోనే మృతిచెందాడు. గురువారం ఉదయం తాళ్లరాంపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇందల్వాయి ఎస్సైపై కేసు

ఇందల్వాయి: ఇందల్వాయి పీఎస్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్సై మహేశ్‌పై కేసు నమోదైనట్లు సమాచారం. ఓ మహిళను మోసం చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో నిందితుడు

వర్ని: మండలంలో మోటార్ల దొంగతనానికి పాల్పడుతున్న ఓ నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ జయేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురం జీపీలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఇటీవల మోటారు పంపుసెట్టు చోరీకి గురైంది. ఈ పంపు సెట్టును వర్నిలోని పాత ఇనుప సామాను దుకాణంలో గుర్తించినట్లు తెలిపారు. విక్రయించిన వ్యక్తితో పాటు కొనుగోలు చేసిన దుకాణ యజమానిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.